

క్రైస్తవ మాసపత్రిక
కృపా వాక్యము
www.preachers trainingschool.com
జనవరి
2022

Editor:
**Dr. K.G. Kumar,** Founder, President & Director, Preachers Training Schools

ఈ సంచికలో . . .

1. నీ దేవుడైన యెహోవాను ఘనపర్చు - కె.జి. కుమార్
2. హబక్కూకు - జి. సుదర్శనం
3. దేవుడు కోరుచున్న నూతనమైనవి - డి. శ్రీధరరావు
4. ఓ జీవన నేస్తమా జాగ్రత్త ! - 99 - కె. సంధ్యారాణి
5. ప్రసంగ వ్యాసము - కె.జి. కుమార్

## OWNERSHIP INFORMATION:


| | | |
|---|---|---|
| Publisher | : | Dr. K.G. Kumar |
| Printer | : | Mr. G. Venkateswarao |
| Owner | : | Dr. K.G. Kumar |
| Printing Press | : | Near Pindala Tank<br>Jawahar Street<br>Kakinada-533003 |
| Place of Publication | : | Turangi, Kakinada-533 016<br>D.No.7-113, Ravindranagar,<br>Turangi, Kakinada-533 016,<br>E.G.Dist., A.P., |
| Periodicity of Publication & Language | : | Monthly, Telugu & English |
| Nationality | : | Indian |


సింగిల్ కాపీ : 20/- సంవత్సరపు చందా : 200/- జీవితకాలపు చందా : 1500/-
మీ చందాను ఈ దిగువ బ్యాంకు అకౌంట్‌కైనను పంపవచ్చును

**ది సౌత్ ఇండియన్ బ్యాంక్, కాకినాడ**

RTGS Code: SIBL0000126 , అకౌంట్ నెం. 0126053000018487

కృపావాక్యము మాసపత్రిక కావలసినవారు చందా పంపవలసిన చిరునామా
ఎడిటర్, కృపావాక్యము cell: 9849031095, 6309686167
రవీంద్రనగర్, తూరంగి
కాకినాడ-533016, తూ.గో.జిల్లా, ఆం.ప్ర., ఫోన్: 2342125
Email: kedarisetti_2000@yahoo.com
Website: www.preacherstrainingschool.com

# కృపావాక్యము

CHURCH OF CHRIST

Pleading for the Unity of Brotherhood

క్రీస్తుసంఘము. మత్త. 16:18, ఎఫె. 1:22,23, కొల. 1:18,24, రోమా 16:16

సంపుటి 25 జనవరి 2022 సంచిక 1


## నీ దేవుడైన యెహోవాను ఘనపర్చు

రక్షకుండుదయించినాడట మన కొరకు బరమ రక్షకుండుదయించినాడట రక్షకుడుదయించినాడు రారెగొల్లబోయలరా - తక్షణమున బోయి మన నిరీక్షణ ఫలమొందుదము

ఈ పాటను క్రైస్తవులు క్రిస్టమస్ పండుగ దినమున ఎంతో సంతోషముతో పాడుట అనేక సం॥ల ఆనవాయితీగా మనము వినుచున్నాము. ఇది గొల్లవారు పాడిన పాట కాదు మరియు యూదులు పాడినది కాకపోవచ్చు, ఇది ఎవరు వ్రాసినారో నాకు ఎరుకలేదు. అయితే రచయిత నేటివాడుగా చూచుచున్నాము. రచయిత కల్పనలో గొల్లవారు (గొఱ్ఱెల మందలను మేపు యూదులతో సంభాషించినట్లు గ్రహించగలము). ఇంకా మనకు అర్ధమగుచున్న విషయమేమనగా "తక్షణమున బోయి మన నిరీక్షణ ఫలమొందుదము" అనగా ఎవరైతే తమ ప్రవక్త కొరకు ఎదురుచూచుచున్నారో ఆ వ్యక్తిని పొందడమే వారి నిరీక్షణ ఫలము.

ఇశ్రాయేలు ప్రజలకు తమ ప్రవక్తలు ఎవరిని గూర్చి తెలుపునో లేక ప్రవచించిరో, తమ విశ్వాసమునకు కర్తయు కొనసాగించువాడైన ఒక గొప్ప వ్యక్తి రాబోవుచున్నాడని, మోషే చెప్పినాడు (ద్వితీ. 18:16). నాలాంటి ప్రవక్తను దేవుడు మీకు అనుగ్రహించినాడు, ఆయన మాట వినుడి అని గాని అయితే వారి సొంత ప్రవక్తలు, ప్రవచించిన ప్రవచనములు వారికి అర్థము కాలేదు గాని వారితో సంబంధమైన ఒక గొప్ప వ్యక్తి వారి చిన్న దేశమైన ఇశ్రాయేలు దేశమును సువిశాలమైన సామ్రాజ్యముగా విస్తరించి,

వారి కీర్తి, ఘనతలను భూప్రపంచముయొక్క నలుమూలలకు విస్తరించువాడు, వారు ఆయనకు ఒక సింహాసనమును ఇచ్చి రాజుగా చేసి వారి మనోవాంఛను తీర్చుకొనుటకు ఆశపడిరి. ఎందుకనగా ఆనాటి కాలములో రోమా సామ్రాజ్యము భూమియందంతటా విస్తరించి పాలించుట వారి కీర్తి, ఘనతలను చూచుచున్నారు.

యూదులు తమ దేవున్ని, ఆయన కుమారునియొక్క ఉద్దేశమునుగాని ఎరుగరైరి. భౌతికమైనవారు గనుక దానియందు ఆశ కలిగియుందురు. అయితే ప్రభువు ఇలా అన్నారు. "నా రాజ్యము ఇహలోకసంబంధమైనది కాదు" అలాగైనచో నా సేవకులు దాని కొరకు పోరాడుదురు, నా రాజ్యము ఆత్మసంబంధమైనది. కాబట్టి ఈ భూమిపైన మీలాంటి లేక మీరు కోరుచున్నదానిని నేను స్థాపించుట నా తండ్రి చిత్తం కాదు.

ఒక విషయము మనము ఆలోచింతుము, రక్షకుడుదయించినాడు అనగా జన్మించినాడు, ఈయన ఇశ్రాయేలుచేతను రాజులచేతను తృణీకరించబడి, యూదులు తమ అసూయచేత ఆయనను కౄరముగా సిలువ వేయించి తమ మనోవాంఛను నెరవేర్చుకొన్నారు. అయితే ప్రభువు ఆ మనోవాంఛలో ఆయన ఆత్మసంబంధమైన నీతి రాజ్యము స్థాపించబూనెను. ఈ పాట పాడు క్రైస్తవులారా మీ హృదయములో ఈ ప్రభువు ఉదయించినాడా?

అయితే ప్రభువు చెప్పు ఒక మాటను చూద్దాము నేను మరలా వచ్చునప్పుడు ఈ భూమిపై విశ్వాసమును కనుగొందునా? (లూకా 18:8). నిరీక్షణ ఫలమొందుదము, ఇది అబ్రాహాము తన గర్భవాసము నుండి రక్షకుడు వస్తాడన్న విశ్వాసఫలము ప్రభువైన క్రీస్తు. ఆ ఫలమును వారి విశ్వాసము ద్వారా రుచిచూడలేకపోయి కారుద్రాక్షలు కాయుటకు అలవాటుపడినారు. "ప్రభువు దయాళుడని మీరు రుచిచూచియున్న యెడల సమస్తమైన దుష్టత్వమును, సమస్తమైన కపటమును, వేషధారణను, అసూయను, సమస్త దూషణ మాటలను మాని, క్రొత్తగా జన్మించిన శిశువులను పోలినవారై, నిర్మలమైన వాక్యమను పాలవలన రక్షణ విషయములో ఎదుగు నిమిత్తము, ఆ పాలను అపేక్షించుడి" (1 పేతు. 2:1-3). "యెహోవా ఉత్తముడని రుచి చూచి తెలిసికొనుడి ఆయనను ఆశ్రయించు నరుడు ధన్యుడు" (కీ. 34:8). నేడు ఈ పాట పాడు క్రైస్తవుల హృదయమునందు ఈ విశ్వాసము కలిగియున్నారా? కేవలము క్రిస్టమస్ రోజున ఆ పాట పాడువారుగా నున్నారా? క్రిస్టమస్ రోజున ప్రభువు పుట్టెనని, క్రొత్త బట్టలు, కేక్స్-కేండిల్స్

విందులు వినోదములు చేసుకొనుటకు మాత్రమే ప్రభువును నమ్ముకొనుచున్నావా?

మొదటిగా క్రైస్తవుడైన ప్రతి వ్యక్తి తన కుటుంబమును గూర్చి ఆలోచించుట అవసరము. నీ కుటుంబమునకు అవసరమగు ప్రతీ అవసరత తీర్చుచున్నావు అది ఎంత ఖరీదుయైనసరే, రోగమువస్తే లక్షలు ఖర్చుపెట్టుచున్నావు గాని, నీ నిరీక్షణకు కారణమైన ప్రభువును నీ గృహములోకి ఆహ్వానించుట మరచితిరేమో? Christ is the head of this house - He is a silent Listioner at Every Conversation and he is an unseen guest at Every meal" దీని భావమేమనగా (క్రీస్తు మా గృహమునకు యజమానుడు, ఆయన మా ప్రతీ సంభాషణ ఆలకించును మరియు ఆయన మా భోజన బల్లయొద్ద కనబడని అతిధి) అను నామకార్థమైన అతిశయోక్తితో కూడిన ఒక Slogan నీ గృహమునందు అలంకరించుకొను నామకార్ధ క్రైస్తవుడా?

నేడు మనకు కలుగుచున్న మరణభయమువలన అనేకులు మృతిచెందిరి, అనేకులు బలహీనులగుచున్నారు. ఇది కేవలము ప్రపంచములో ప్రబలిన పాపమువలనే జరుగుచున్నది "దుర్నీతిచేత సత్యమును అడ్డగించు మనుష్యులయొక్క సమస్త భక్తిహీనతమీదను, దుర్నీతిమీదను దేవుని కోపము పరలోకమునుండి బయలుపరచబడు చున్నది" (రోమా 1:18) ఏమిటి ఈ దుర్నీతియని ప్రశ్నింతువా? నేడు అమెరికా దేశములో వెలసిన నానావిధములైన మత విగ్రహముల గుళ్ళు, గోపురములు, మసీదులు ఇంకను అనేకమైన అన్యమత విశ్వాసమువలన ఆ దేశము శాపితమునకు కారణమగుచున్నది. ఒక విషయమును గ్రహించుదాము. అమెరికావారు ప్రతివిధమైన కూడికలో చివరిగా God bless America (మా అమెరికా దేశమును దీవించుమని) అని ముగించుట వారి జీవనశైలిలో భాగము. నేడు ఈ మాట పలికినప్పుడు ఆ దేశములోని విగ్రహారాధికులను ఆ గుళ్ళను ఏ దేవుడు దీవించును, ఇలాంటి స్థితివలనే ఇశ్రాయేలు పతనమైన విషయము జ్ఞాపకముంచుకొనుట అవసరము.

"కొందరు రథములనుబట్టియు కొందరు గుఱ్ఱములను బట్టియు అతిశయపడుదురు. మనమైతే మన దేవుడైన యెహోవా నామమునుబట్టి అతిశయపడుదము" అని దావీదు పలికినమాటలను పరిశీలించు (కీ. 20:7).

అమెరికా దేవునిమీద ఆధారపడడం మానేసి చాలా కాలమయింది. ఇప్పుడు అ దేశం ఆయుధాలమీద ఆధారపడుతున్నది. అమెరికా ఇరవైలక్షల సైన్యాన్ని కలిగివుంది.

ప్రపంచవ్యాప్తంగా ఉన్న అమెరికా స్థావరాలకు ఏటా కొన్నివేల కోట్లు డాలర్లు ఖర్చువుతున్నది. అమెరికా నావికాదళాలు సముద్రంలో వున్న ఎటువంటి ఓడనైనా కొద్ది గంటలలోనే ముంచివేయగలదు. అందువలన ఇరవై ఒకటొవ శతాబ్దపు రథాలను, గుర్రాలను మనం నమ్ముతున్నాం. అయితే దావీదు యెహోవా నామమును నమ్మాడు. రాజకీయ నాయకులను, శాస్త్రవేత్తలను, సాయుధ యుద్ధబలగాలను నమ్ముకోవడం కంటె ఆత్మలో ఉన్నతమైన స్థితిలో ఉన్నవారిని నమ్మడం అమెరికాకే మేలు. అమెరికా దేశము క్రైస్తవ మూలములలో నుండి కలిగినది వారు యెహోవాను యెరిగినవారు, వారి రాజ్యాంగ సూత్రాలు బైబులుపైన ఆధారపడి వ్రాయబడినవి గాని ఇప్పుడు అన్యవిధానములకు చేరువైనవి.

ఈ దినాలలో శక్తివంతమైన ఆయుధాలను కలిగివుండకపోతే శత్రుబలాన్ని ఎదిరించలేము. దావీదుకు దేవునిమీద విశ్వాసం ఉంది గదా అని సైన్యాన్ని వద్దనలేదు. అతనికి శక్తివంతమైన సైన్యం, సైన్యాధికారులు ఉన్నారు. యోవాబు, ఆశాహేలు, షమ్మా, బెనయా, అబీషై వంటి మహా బలాఢ్యులు, యుద్ధవీరులు ఉన్నారు. అయితే దావీదు నమ్మకం వీరిమీద లేదు. అతని విశ్వాసం దేవునిమీద ఉంది.

“వారు క్రుంగి నేలమీద పడియున్నారు. మనము లేచి చక్కగా నిలుచున్నాము యెహొవా రక్షించుము. మేము మొఱ్ఱపెట్టునపుడు రాజు మాకుత్తరమిచ్చునుగాక” గ్రీకు తర్జుమాలో “దేవుడు రాజును రక్షించునుగాక” అని వుంది.

ఈ వాక్యంమీదే బ్రిటన్ జాతీయగీతం వ్రాయబడింది. అమెరికాలాగే బ్రిటన్ కూడా ఇప్పుడు దేవునిలో విశ్వాసముంచడంలో చాలా దూరం వెనక్కి వెళ్ళిపోయింది. దేవునిమీద పూర్తిగా ఆధారపడితేనే శత్రువులు నేలకు పడతారు. మనం లేచి నిలబడతాము. ఈ రోజుల్లో మనకు కావలసింది అదే.

ఈ **20** వ కీర్తన లో దావీదు మహ రాజు వ్రాసిన విషయములను మనం మన వ్యక్తిగత జీవితాలకు ఈ సూత్రాన్ని అన్వయించుకుందాం. మనం పోరాడేది శరీరులతో కాదు. దురాత్మల సమూహాముతో (అనగా దురాత్మలు అంటే దెయ్యములని అపోహపడకండి అయితే దురాత్మల సమూహాము అనగా మన చుట్టూ వున్న క్రీస్తు విరోధులుతో) పోరాడుతున్నాము. మన సమస్యల నుండి మనకు విడుదల కావాలంటే మనం కూడా దావీదువలె దేవునిమీద పూర్తిగా ఆధారపడాలి.

క్రైస్తవుడా నీ హృదయములోగాని, నీ గృహములోగాని విగ్రహసంబంధమైనది ఏది వున్నా నీ ప్రభువు నీ హృదయములోగాని, నీ గృహములోగాని ప్రవేశింపడు గాన నీవు విశ్వసించిన ప్రభువు విశ్వాసమునకు కర్త అనగా సృష్టించినవాడు దాని మన హృదయములో కొనసాగించువాడు ఎప్పుడనగా నిర్జీవ క్రియలను మనలోని మనస్సాక్షి నుండి వైదొలగినచో క్రీస్తు రక్తముతో శుద్ధిచేయబడును (హెబ్రీ 9:14).

కేవలము పాట పాడువారము కాక నిరీక్షణ ఫలమొందుదము. మన నిరీక్షణ లేక విశ్వాస ఫలము, నిత్యజీవము, పరలోకము. విశ్వాసము నిరీక్షణదై అబ్రాహాము, శారాలు మృతతుల్యులైన ఫలమును పొందిరి. మన శరీరములు మృతతుల్యమైనను మన ఆత్మజీవము గలది గాన మన జీవాధిపతియైన ప్రభువు ప్రత్యక్షమైనప్పుడు మనమును ఆయనవలే నుందుము. అబ్రాహాము పొందిన విశ్వాస నిరీక్షణ ఫలము మనము పొందగలము నిజముగా యేసు మన హృదయములో ఉదయించిన యెడల ఆ ప్రభువును కలిగినవాడు ప్రతివిధమైన దుష్టత్వమునుండి దూరమగును, నీవు దుష్టత్వము నుండి దూరమైనప్పుడు నీవు పొందు సమాధానము, మనశ్శాంతి ఎంతో గొప్పది. అవి ప్రభువువలనే దొరకును గాన మనలో విఙ్ఞవీగుచున్న దుష్టత్వము, వేషధారణ మాని పేతురుగారు చెప్పినట్లు నిర్మలమైన వాక్యమను పాలకుల రక్షణ విషయములో ఎదుగు నిమిత్తము ఆ పాలకులను (వాక్యము) అపేక్షించుడి. ఆదివారము తమ దేవుని ఆరాధించుటకు వెళ్ళని, రాని క్రైస్తవులు ఏమై యున్నారు. వారు దుష్టులును, నరకపాత్రులునై యున్నారు. నెలకొకమారు కనబడి ప్రభువు బల్లలో పాలుపొందువారు సిగ్గు, ఎగ్గులేని వేషధారులు, రోగాన పడినప్పుడు అన్ని సంఘములకు చీటీలు వ్రాసి చందా పంపించి ప్రార్థించమని కోరుదురు, అలాగునే సిగ్గులేని పాస్టర్లు ప్రార్థింతురు, పాపుల ప్రార్థన విననన్నా దేవునికి మారుమనస్సు బోధింతువా?

పాపులును ద్విమనస్కులులైన వారి ప్రార్థనలు దేవుడు వినడు ఒకవేళ ఆ రోగి బ్రతికినవారైన మారుమనస్సు పొందరు. ఇక ఈ కరోనా కాలములో తెలిసినవారి కొరకు ప్రార్థించుట జరిగినది. వారు స్వస్థపడి దేవుని వైపుకు తిరుగుదురన్న ఆశతో అయితే నరకమే వారికి వెచ్చగా నున్నదన్న సాక్ష్యము చూపుచు లోకములో వారి దేవతలతో తిరుగుచున్నారు. ఇది దేవుడు సహించునా? కాబట్టి అన్యుల ఆత్మ రక్షణ కొరకు ప్రార్థించుదాము గాని వారి కోరికలు కొరకుకాదు సుమా!

BOOK-REVIEW జి. సుదర్శనం, చెన్నై Cell: 09283136662

# హబక్కూకు

**పరిచయం** : హబక్కూకు గ్రంథము చెఱకు ముందు పత్రిక నెబుకద్నెజరు యూదా దేశముమీదికి క్రీ.పూ. 606-604లో మొదటి దండయాత్ర చేసెను. ఈ సంగతి చెరకు ముందే తెలిపెను. దేవుడు ఉత్తర దిక్కు (బబులోను) నుండి కీడు నాశనము వస్తుందని యిర్మీయా ప్రవచించెను (యిర్మీ. 4:6) మరియు యిర్మీయా ఈలాగు తెలుపుచున్నాడు. బబులోను రాజు నెబుకద్నెజరు యూదా రాజ్యముమీదికి యుద్ధానికి వస్తాడు. మిమ్మును దేవుడు బబులోను రాజునకప్పగించాడు (యిర్మీ. 21:3-7).

యిర్మీయావలెనే, హబక్కూకు కూడా చెఱకు ముందే ఈ సంగతిని తెలియపరుచుచున్నాడు (హబ. 1:6-10).

హబక్కూకు గూర్చిన పూర్తి వివరాలు తెలియలేదు కాని ఆయన దేవుని ప్రవక్తయని గ్రంథము తెలిపినది (హబ. 1:1, 3:1). యూదా రాజైన యోషియా కుమారుడైన యెహోయాకీము యూదాకు రాజై యున్నాడు. యిర్మీయా ప్రవక్తయై యున్నాడు (యిర్మీ. 1:1-3).

యిర్మీయా యూదా రాజైన యెహోయాకీమునకిచ్చిన హెచ్చరిక. నిరపరాధుల రక్తమును చిందింపకుడి (యిర్మీ. 22:3-6).

**ఉద్దేశము** : నీతిమంతుడు విశ్వాసమువలన బ్రతుకును (హబ. 2:4)

**చర్చనీయాంశం** : దేవునియందు విశ్వాసముంచియు దిగ్భ్రాంతి చెందిన మనుష్యుని బ్రతికించుట దేవునికి ఇష్టమైన పని (హబ. 2:4).

## రెండు ప్రశ్నలు చర్చించబడ్డాయి

1. <u>మొదటి అధ్యాయము</u> : శిక్ష విధింపకుండ యూదాలో అంతులేని దుష్టత్వాన్ని దేవుడెందుకు సమ్మతించుచున్నాడు? (1:1-4)

2. యూదాకంటే ఎక్కువ దుష్టత్వముగల బబులోనీయులచేత యూదులను శిక్షించుటకు వారిని ఎందుకుపయోగించుకొనుచున్నాడు? (1:5-11) <u>మొదటి ప్రశ్న</u>

3. హబక్కూకుయొక్క **రెండవ ప్రశ్న** : ఆశ్రయ దుర్గమా, మమ్మును దండించుటకు, బబులోనీయులను ఎందుకు పుట్టించితివి? నీతిపరులు నశించుటను నీవెందుకు చూస్తున్నావు? ఎన్నటికి మానకుండ బబులోనీయులు యూదా జనమును హతము చేయుచుండవలెనా? (1:12-17)

4. **రెండవ అధ్యాయము:** ప్రవక్తయొక్క ప్రశ్నలకు దేవునియొక్క బదులు - యూదా దేశమందు దుష్టత్వము ఉనికిలో యున్నది. యూదా రాజు నుండి ప్రజల వరకు నీతి న్యాయములను విసర్జించి మారుమనస్సు పొందకుండ దేవునాశ్రయించుట మానిరి. వారు దేవునియొక్క మంచితనాన్ని మరియు రక్షణయొక్క ఉద్దేశాన్ని గ్రహించలేని తనాన్ని తెలుపుచున్నది. ఇది దేవుని ఏర్పాటునకు మూలమైనది. "ఎందుకనిన- నీతిమంతుడు విశ్వాసమూలముగా జీవించునని వ్రాయబడిన ప్రకారము విశ్వాసము మూలముగా అంతకంతకు విశ్వాసము కలుగునట్లు దేవుని నీతి దానియందు బయలు పరచబడుచున్నది" (రోమా 1:17 cf గల. 3:12). "నా యెదుట నీతిమంతుడైనవాడు విశ్వాసమూలముగా జీవించును గాని అతడు వెనుక తీసిన యెడల అతనియందు నా ఆత్మకు సంతోషముండదు" (హెబ్రీ 10:38) అని తెలుపబడినది. ప్రవక్తయొక్క ప్రశ్నలకు ఆనాటి యూదా ప్రజలకు దేవునియొక్క జవాబు మాత్రమే కాదు; ఈనాటి క్రైస్తవులకును, క్రొత్త నిబంధన నీతి సూత్రములకు ఆధారమునై యున్నవి.

5. **మూడవ అధ్యాయము:** భక్తిపూర్వకమైన స్తుతిగీతాలాపన జరిగినది. **అన్వహింపు (APPLICATION)?**

నీతిమంతుడు విశ్వాసమువలన జీవిస్తాడు. ఇది పరలోకపు వర్తమానము. అనుకూల పరిస్థితులలోను, అనుకూలములేని పరిస్థితులలోను దేవునియందలి విశ్వాసముతో జీవిస్తాడు. పరిస్థితుల ప్రభావాలకు భయపడడు. విచిత్రాలు-విడ్డూరాలు జరిగిన విశ్వాసిగానే జీవిస్తాడు (3:17-19). యెరూషలేము దుస్థితి వర్ణించబడినది ప్రవక్త ప్రశ్నలకు దేవుని జవాబులందించబడినది (1:1-17). నీతిమంతుడు విశ్వాసము ద్వారా బ్రతుకుతాడు (2:1-4). విశ్వాసియైతే విశ్వాసమువలన జీవించుచూ సమస్త యేలుబడి దేవుడు తన స్వాధీనములో పెట్టుకొని యున్నాడు. పరిస్థితులనుబట్టి ఆందోళన చెందవద్దు అనేది 3వ అధ్యాయముయొక్క సందేశమై యున్నది.

## OUTLINE గ్రంథ విభజన

పరిచయం : 1:1

I. హబక్కూకు సమస్యలు (1:2-2:20)

ఎ) దుష్టచర్యలను దేవుడు యూదాలో ఎందుకు సహించుచున్నాడు (1:2-4)

బి) అందుకు దేవుని జవాబు (1:5-11)

సి) యూదులను శిక్షించటానికి వారికంటే ఎక్కువైన దుష్టజనమును దేవుడెందుకు ఉపయోగించుకొనుచున్నాడు (1:12-2:1)

డి) అందుకు దేవుని జవాబు (2:2-20)

II. హబక్కూకు స్తుతి ఆలాపన (3:1-19)

ఎ) వ్యక్తిగా దేవునికి స్తుతి ఆలాపన (3:1-3)

బి) శక్తిగా దేవునికి స్తుతి (3:4-7)

సి) సంకల్పమునుబట్టి దేవుని స్తుతి (3:8-16)

డి) విశ్వాస విశేషమునుబట్టి దేవునికి స్తుతి (3:17-19)

# దేవుడు కోరుచున్న నూతనమైనవి

## "God Want's these New things"

ఓ. శ్రీధరరావు
9154927278

**మూలవాక్యం:-** యెష. 43:18-19, 2 కొరి. 5:17

ప్రభువునందు ప్రియమైన పాఠకులకు ప్రభువైన యేసుక్రీస్తు నామమున వందనములు మరియు నూతన సంవత్సర శుభాకాంక్షలు.

**పరిచయము:-** ప్రభువుయొక్క మహాకృపనుబట్టి మరియొక సంవత్సరములోనికి మనము ప్రవేశించియున్నాము. అయితే నూతన సంవత్సరములలో దేవునికి ఏమియు పనిలేదు నూతన వారములు, నూతన దినములు, నూతన సంవత్సరములు దేవునికి ప్రయోజనము కాదు. అవి మానవునికి మాత్రమే ఉపయోగము అనునవి అయితే దేవుని నూతనము అయినవి ఏవి కావాలి అనగా

**1) నూతన హృదయము దేవునికి కావాలి:-** యెహె. 36:26. దేవుడు ఇశ్రాయేలుకు నేను మీకు నూతన హృదయాన్ని కలుగజేతును అని చెప్పుచున్నాడు. దావీదు

దేవా నాయందు శుద్ధహృదయము కలుగజేయుము అని దేవునిని కోరుచున్నాడు (కీ. 51:10). అలాగునే యిర్మి. 17:9 హృదయము మోసకరమైనది అనియు, ఘోరమైన వ్యాధి కలదు అని చెప్పుచున్నాడు. కనుక హృదయమును శుద్ధి చేసుకొనుట అవశ్యమైనది దానిని క్రీస్తు రక్తము మాత్రమే శుద్ధి చేయగలదు. కాబట్టి సువార్తకు లోబడి బాప్తిస్మము పొందుట ద్వారా హృదయమును శద్ధి చేసుకోగలము.

**2) నూతన స్వభావము:-** దీనిని పౌలు నవీన స్వభావము అని సంబోధించెను (ఎఫె. 4:24). దేవునికి నూతన స్వభావము కలిగినవారు కావలెను. అనగా క్రైస్తవుడు కాకమునుపు ఉన్న పాత జీవితమును పూర్తిగా విసర్జించువారై యుండాలని ప్రభువు కోరుచున్నాడు. పాత క్రియలు, పాత తలంపులు, పాత చెడ్డ అలవాట్లు పూర్తిగా విడిచిపెట్టాలని దేవుడు కోరుచున్నాడు. మనుష్యులు పై రూపము చూచును దేవుడు హృదయాంతరంగమును చూచును (1 సమూ. 16:7, మార్కు 7:21).

**3) నూతన నాలుక:-** కీ. 39:1-2. దావీదు తన నాలుకతో పాపము చేయకుండునట్లు నా మార్గములను జాగ్రత్తగా చూచుకొందును అని చెప్పుచున్నాడు. అనగా వ్యర్థమైన మాటలు నిష్ప్రయోజనమైన మాటలు మాట్లాడకుండా మంచిమాటలను మాట్లాడునట్లు నాలుకను కాచుకొందుము (కీ. 35:28). నా నాలుక నీ నీతిని గూర్చియు, నీ కీర్తిని గూర్చియు పాడును అని చెప్పుచున్నాడు. చెడ్డదానిని పలుకకుండ తన నాలుకను కపటపు మాటలు చెప్పకుండ తన పెదవులను కాచుకొనవలెను (1 పేతు. 3:10).

**4) నూతన సంతోషం (ఆనందం):-** రోమా 14:17. దేవుని రాజ్యము భోజనము పానమును కాదు గాని నీతియు సమాధానము పరిశుద్ధాత్మయందలి ఆనందమునై యున్నది. కనుక నపుంసకుడు బాప్తిస్మము పొందిన తరువాత సంతోషముతో ఇంటికి వెళ్లిపోయెను (అపొ.కా. 8:39). బాప్తిస్మము పొందుట ద్వారా నూతన సంతోషము కలుగును (ఫిలి. 4:4). మన సంతోషము పరిపూర్ణమగుటకు ఇవి వ్రాయబడెను (1 యోహా. 1:4).

**5) నూతన ఫలములు:-** మారుమనస్సునకు తగిన ఫలములు ఫలించుడి, లూకా 3:8. దేవుడు మన నుండి నూతన ఫలములు కోరుచున్నాడు (2 కొరి. 9:10). మీ నీతి ఫలములు వృద్ధి పొందించును పౌలు ప్రాధేయపడుచున్నాడు. ఫలములు ఫలింపని పనికిమాలినచెట్టు నరకబడి అగ్నిలో వేయబడును (మత్త. 7:19). మనము క్రీస్తుకొరకు

మంచి ఫలములు ఫలించువారమై యుండాలి (పరమ 7:13). ఆత్మీయ ఫలములు ఫలించాలి (గల. 5:22). జిహ్వాఫలములు అర్పించుదుము (హెబ్రీ 13:15).

**6) నూతన పేరు (క్రొత్త పేరు):-** యెష. 62:2. "యెహోవా నియమింపబోవు క్రొత్త పేరు నీకు పెట్టుదును" అని దేవుడు యెషయా ద్వారా ప్రవచించెను. నేడు బాప్తిస్మము పొందినవారు క్రైస్తవులు అని పిలువబడుచున్నారు ఇది ప్రభువైన క్రీస్తు ద్వారా మనకు లభించిన నూతన పేరు (క్రొత్త పేరు) అంతియొకయలో శిష్యులు మొట్టమొదటిగా క్రైస్తవులనబడిరి (అపొ.కా. 11:26).

ఈ సంగతులు ఏలాగు సాధ్యము అనగా క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన తరువాత క్రైస్తవ జీవితమును కొనసాగించుట ద్వారా సాధ్యమగును. ఆయన విధులు, ఆజ్ఞలు, హెచ్చరికలు అనుసరించి నడుచుట ద్వారా ఇవి సాధ్యమగును. సంవత్సరములు, నెలలు, వారములు, రోజులు ఇవి ఎప్పుడు మారుచునే ఉంటాయి, అవి కాదు దేవునికి ప్రాముఖ్యమైనవి, మనుష్యులు వారి ప్రవర్తనలో మార్పును దేవుడు కోరుచున్నాడు. పాతవి గతించెను ఇదిగో క్రొత్తవాయెను (2 కొరి. 5:17).

## ఓ జీవన నేస్తమా జాగ్రత్త!-99

కె. సంధ్యారాణి, B.A.
పి.టి.స్కూల్

ప్రభువుపేరట కృపావాక్యము చదువరులకు నా వందనములు మరియు నూతన సంవత్సరము శుభాకాంక్షలు.

గత సంచికలో మనం పవిత్రతను గూర్చి కొన్ని విషయములను నేర్చుకొని యున్నాము. అదేవిధముగా ఈ నెల కూడా మరికొన్ని విషయములను పవిత్రతను గూర్చి నేర్చుకుందాము.

> మెట్టుకు సహోదరులారా, యే యోగ్యతయైనను మెప్పైనను ఉండినయెడల, ఏవి సత్యమైనవో, ఏవి మాన్యమైనవో, ఏవి న్యాయమైనవో, ఏవి పవిత్రమైనవో, ఏవి రమ్యమైనవో, ఏవి ఖ్యాతిగలవో, వాటిమీద ధ్యానముంచుకొనుడి (ఫిలి 4:8).

ప్రియులారా అ.పొ. పౌలుగారు ఎంత జ్ఞానముతో దేవుని ఆత్మద్వారా ఈ మాటలను వ్రాసియున్నారో గమనించినారా?

క్రైస్తవులనబడే ప్రతి ఒక్కరూ ఈ వచనభాగమును జ్ఞప్తికి తెచ్చుకోవాలి.

ఎందుకనగా మనము అన్యులము కాదు ఏది పడితే అది చేయుటకు, మనకు నచ్చినట్టుగా జీవించుటకు. మనకంటూ ఒక ప్రత్యేకత వున్నది ఈ లోకములో కనుక ఏదైనా పనిచేసేటప్పుడు ఒక క్రైస్తవురాలిగా ఇది నేను చేయవచ్చునా లేదా అనే ప్రశ్న వేసుకోవాలి. అదే విధముగా ఏది న్యాయమైనవో, ఏవి పవిత్రమైనవో అనగా ఏదైతే దేవుని దృష్టికి అనుకూలముగా ఉంటుందో అదే మనము చేయాలి. అపవిత్రమైనవాటి జోలికి మనము పోకూడదు అని పౌలుగారు చెబుతారు. ఎందుకనగా అవి మనకు కాదు అన్యులకు.

> మీలో జారత్వమే గాని, యే విధమైన అపవిత్రతయే గాని, లోభత్వమే గాని, వీటి పేరైనను ఎత్తకూడదు, ఇదే పరిశుద్ధులకు తగినది. కృతజ్ఞతావచనమే మీరుచ్చరింప వలెను గాని మీరు బూతులైనను, పోకిరిమాటలైనను, సరసోక్తులైనను ఉచ్చరింప కూడదు; ఇవి మీకు తగవు (ఎఫె. 5:3,4).

ప్రియులారా కేవలము మన శరీరమును పవిత్రముగా ఉంచుకొనుటయే కాదు గాని మన నోటిని కూడా పవిత్రముగా ఉంచుకోవాలి లేకపోతే మన నోటిద్వారా కూడా మనము నరకమునకు వెళ్లే అవకాశము వున్నది. చాలామంది స్త్రీ, పురుషులు పైకి భక్తిగానే కనిపిస్తారు కానీ వారు నోరు తెరిస్తే వారి గృహములో బూతులే మాట్లాడుకుంటారు. ఇది చాలా విచారకరము.

ఒక సోదరి నాకు తొలి పరిచయములోనే తన భర్తను గూర్చి ఇలాగున చెప్పింది. సిస్టర్ గారు మా ఆయన పైకి బాగానే వినయముగానే ఉంటాడండీ కానీ మా ఇంట్లో నన్ను పచ్చి బూతులు తిడతాడండీ ఒకసారైతే నాకు ఈయన మాట్లాడే బూతులన్నీ ఫోన్లో రికార్డుచేసి సారుకి వినిపించాలన్నంత కోపం కూడా వచ్చింది అని ఆమె చెప్పినప్పుడు నిజముగా నాకు నమ్మశక్యము కాలేదు. కారణమేమనగా ఆయన పైకి ఎంతో సామ్యుడిగా కనబడతాడు, అందులోను ఆయన దైవజనుడు.

ప్రియులారా ఇలాగున వున్నారు మన క్రైస్తవులు భార్యలను బూతులు తిట్టే భర్తలు లేక భర్తలను బూతులు తిట్టే భార్యలు. సోమవారం నుంచి శనివారం వరకు బూతులు తిట్టుకొని ఆదివారమున కలిసి ఆరాధనకెళ్లుట ఎంత హాస్యాస్పదము!

ఇలాంటి క్రైస్తవ జీవితము దేవునికిష్టమైనదేనా అని మనం ఆలోచన చేసినప్పుడు ఆయన ఎన్నటికిని ఇలాంటివారిని క్షమించడు. అందుకనే పౌలుగారు ముందుగానే

హెచ్చరిస్తున్నారు క్రైస్తవుల నోటినుంచి  కృతజ్ఞతావచనమే తప్ప పోకిరిమాటలు, బూతులు రాకూడదు అని.

పవిత్రులకు అన్నియు పవిత్రములే గాని అపవిత్రులకును అవిశ్వాసులకును ఏదియు పవిత్రమైనది కాదు; వారి మనస్సును వారి మనస్సాక్షియు అపవిత్రపరచబడి యున్నవి. దేవుని ఎరుగుదుమని వారు చెప్పుకొందురు గాని, అసహ్యులును అవిధేయులును ప్రతి సత్కార్యము విషయము భ్రష్టులునైయుండి తమ క్రియలవలన ఆయనను ఎరుగమన్నట్టున్నారు (తీతు 1:16).

ప్రియసోదరీ మన శరీరములోని ప్రతి అవయవమును పవిత్రముగా ఉంచుకోవాలి.  ఎందుకనగా ఈ దేహము దేవుని ఆలయము అన్న సంగతిని మరువకూడదు. మన కన్నులతో ఏమి చూస్తున్నామో, చెవులతో ఏమి వింటున్నామో, పెదవులతో ఏలాంటి మాటలను ఉచ్ఛరిస్తున్నామో, అదే విధముగా హృదయములో ఎలాంటి తలంపులను నింపుకొన్నామో వీటన్నిటిని గూర్చి మనం ఒకానొక దినమున దేవునికి లెక్కఅప్పగించవలసియున్నది.

పవిత్రుడును, నిర్దోషియు, నిష్కల్మషుడును, పాపులలో చేరక ప్రత్యేకముగా ఉన్నవాడును, ఆకాశమండలముకంటె మిక్కిలి హెచ్చయినవాడునైన యిట్టి ప్రధానయాజకుడు మనకు సరిపోయినవాడు (హెబ్రీ 7:26).

ప్రియసోదరీ మనం నమ్ముకున్న ప్రభువు ఇంత గొప్ప లక్షణములను కలిగియున్నప్పుడు మనము కూడా ఆయన స్థితిలోనికి చేరుటకు ప్రయాసపడాలి. అంతే కానీ దినదినము భక్తి, విశ్వాసములలో సన్నగిల్లకూడదు. ఎందుకనగా ఆయనతో సమానముగా మనము ఆ పరలోకములో కూర్చోవాలి అంటే క్రీస్తు ప్రభువు వారికి వున్న ప్రతి లక్షణమును మనం ధరించుకోవాలి.

ఇంకను ఎవరైనా పాతజీవితమునే జీవిస్తూవుంటే అనగా పాపములోనే జీవిస్తూవుంటే ఆ అపరాధములన్నియు దేవుని యెదుట ఒప్పుకొన్నప్పుడు ఆయన క్షమించి పవిత్రులుగా చేయును.

మన పాపములను మనము ఒప్పుకొనిన యెడల, ఆయన నమ్మదగినవాడును నీతిమంతుడును గనుక ఆయన మన పాపములను క్షమించి సమస్త దుర్నీతినుండి మనలను పవిత్రులనుగా చేయును (1 యోహాను 1:9).

కనుక ప్రియసోదరీ ఈ నూతన సంవత్సరములోనైనా మన ఆలోచనలు దేవునికి మరింత దగ్గరగా వుండాలని, మరియెక్కువగా ఆయన కొరకు బ్రతుకుటను నేర్చుకోవాలని ఆశిస్తూ , ఈ నూతన సంవత్సరపు దీవెనలు, ఆశీర్వాదములు ఆ మహాదేవుడు మనందరికి దయచేయులాగున కోరుకొంటూ ఈ సంచికను ముగిస్తున్నాను.

ప్రసంగ వ్యాసము | కె.జి. కుమార్

## ప్రార్థన అను దిన క్షేమమునిచ్చును

**మూలవాక్యము:**

అందుచేత ఈ సంగతి వినిననాటనుండి మేమును మీ నిమిత్తము ప్రార్థన చేయుటమానక, మీరు సంపూర్ణ జ్ఞానమును ఆత్మ సంబంధమైన వివేకము గలవారును, ఆయన చిత్తమును పూర్ణముగా గ్రహించినవారునై, ప్రతి సత్కార్యములో సఫలులగుచు, దేవుని విషయమైన జ్ఞానమందు అభివృద్ధి పొందుచు, అన్ని విషయములలో ప్రభువును సంతోషపెట్టునట్లు, ఆయనకు తగినట్టుగా నడుచుకొనవలెననియు, ఆనందముతో కూడిన పూర్ణమైన ఓర్పును దీర్ఘశాంతమును కనుపరచునట్లు ఆయన మహిమ శక్తినిబట్టి సంపూర్ణ బలముతో బలపరచబడవలెననియు, తేజోవాసులైన పరిశుద్ధుల స్వాస్థ్యములో పాలివారమగుటకు మనలను పాత్రులనుగా చేసిన తండ్రికి మీరు కృతజ్ఞతా స్తుతులు చెల్లింపవలెననియు దేవుని బతిమాలుచున్నాము (కొల. 1:12).

**ముఖ్యఉద్దేశ్యము:**

గాలి, నీరు, ఆహారము మనుష్యులకు ఎంత అవసరమో క్రైస్తవునికి ప్రార్థన, వాక్యము, సంఘసహవాసము అంత అవసరముగా తెలుసుకొనుట.

**ప్రార్థన అనగా:**

విశ్వాసము గలిగిన ప్రార్థన దేవుని మహిమపరచి దేవునితో సంభాషించుట, దేవుని బ్రతిమిలాడుట. నీతిమంతుని ప్రార్థన దేవుడాలకించును. దేవునితో పోరాటము (కొల. 4:12).

**ఉపోద్ఘాతము:**

ప్రార్థనా విధానములు

1) రహస్య ప్రార్థన. మత్త. 6:6

2) కుటుంబ ప్రార్థన. అపో.కా. 10:2,30

3) గుంపుగా ప్రార్థించుట. మత్త. 18:20

4) బహిరంగ ప్రార్థన. 1 కొరి. 14:14-17

**చర్చనీయాంశము:**

I. ప్రార్థనాంశములు- ఈ వచనము స్వగర్వమువలన పతనము వీడినచో దేవుని కృపను పొందుదురు.

1) Adoration పూజ, అర్చన, ఆరాధన. దాని. 4:34-35

2) Confession ఒప్పుకొనుట. 1 యోహా. 1:9

3) Suppliation విజ్ఞాపనములు. 1 తిమో. 2:1-3

4) అవసరము ప్రార్థన చేయువానికి

ఎ) సంపూర్ణ భక్తియు, మాన్యతయు కలిగి

బి) విజ్ఞాపనములు, ప్రార్థనలు, యాచనలు, కృతజ్ఞతాస్తుతులు చేయవలెను.

సి) దేవునికి మంచిదియును, ఆయన దృష్టికి అనుకూలము

5) Intecession అనగా ఒక నీతిమంతుని ప్రార్థన దేవునికి రోగికిని మధ్య నిలుచును. ఉదా: ప్రవక్తలు (యెషయా) 2 రాజు. 20:1-6, ప్రధాన యాజకుడు, ప్రభువైన క్రీస్తు, సంఘపెద్దలు. యాకో. 5 :14

5) కృతజ్ఞత Thanks giving. ఫిలి. 4:6

II. ప్రార్థన చేయువాని అర్హతలు.

1) పరిశుద్ధాత్మతో (పరిశుద్ధాత్మ కలిగినవారై) ప్రార్థించుట. (యూదా 21)

2) హృదయశుద్ధి కలవారు. కీ. 66:18

3) దేవభక్తుడై యుండి ఆయన చిత్తమును జరిగించువాడు. యోహా. 9:31బి

4) ప్రార్థనకు విశ్వాసము అవసరము. మత్త. 21:22, హెబ్రీ 11:6

5) క్రీస్తు నామములో అడుగవలెను. యోహా. 14:13-21

6) దేవుని చిత్తప్రకారము అడుగుట. 1 యోహా. 5:14

**III.** సాధారణముగా క్రైస్తవులకు వుండవలసినవి.

1) క్షమించే మనస్సు. మత్త. 6:14

2) యదార్థమైన మనస్సు గలిగి సాధారణమైన ప్రార్థన. మత్త. 6:5,6 వేష ధారులవలే కాక

3) మారుమనస్సు కలిగి తన్ను తాను తగ్గించుకున్నవారు. లూకా 18:10-14

4) పొందువరకు, తన్నుతాను పరీక్షించుకొనుచూ అర్హుడుగా చేసుకొనుట. లూకా 18:1-8

ఎ) పట్టుదల. మత్త. 6:5-15

బి) అన్యులవలెనే కాదు, వ్యర్థమైన మాటలు

సి) సహోదరుని నిమిత్తము ప్రార్థించుట. లూకా 11:5-13

5) అవసరతనుబట్టి. లూకా 11:5-6

6) మనస్సుపెట్టి. లూకా 7:6-12

7) అడిగినవి పొందినట్లు భావించి ప్రార్థించుడి. మార్కు 11:24

8) అనేక మాటలు వద్దు. మత్త. 6:7

9) ప్రార్థన మానక చేయుట. 1 థెస్స. 5:15,16

**IV.** ప్రార్థనలు నిరాకరించబడుటకు కారణము.

1) పాపము. కీ. 66:18

2) సుఖభోగములు. యాకో. 4:3

3) సందేహించువాడు. యాకో. 1:5-7

4) అవిధేయత. సామె. 28:9

5) మానవత్వము లేకపోవుట. సామె. 21:13

6) గర్వము. లూకా 18:11-14

7) మీ చేతులు అన్యాయముతో నిండినందున మీ ప్రార్థన వినను. యెష.1:15 కారణములు. సామె. 1:24-25 , ప్రార్థనా విధానము. 1 తిమో. 2:8

8) దేవునితో మాట్లాడినవారు

నోవహు, అబ్రాహాము, ఇస్సాకు, యాకోబు, మోషే, యెహోషువా వీరు దేవుని కొరకు బ్రతికి దేవునిలో నిద్రించిరి. నేటి కాలము - పౌలు

**ముగింపు:**

పరిశుద్ధాత్మను కలిగినవాడే దేవుని కుమారుడు వారు తమ తండ్రికి ప్రార్ధంచగలరు. అయితే పాపిగా కాక నీతిమంతుడుగా ప్రార్ధంచాలి రోమా 8:14. క్రీస్తు ఆత్మలేనివాడు ఆయనవాడు కాడు. రోమా 8:9.

ఆత్మనుబట్టి విత్తువాడు ఆత్మనుండి నిత్యజీవమను పంటను కోయును. గల.6:8

యేసుక్రీస్తు పేరట తండ్రికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించుడి మానక, నిలకడగా యుండి ప్రార్థించుడి. కొల. 4:2

మానక ప్రతి విషయములోను కృతజ్ఞతాస్తుతులు చెల్లించుడి. 1 థెస్స. 5:16.

చెప్పండి　　　ప్రోత్సహించండి　　　పంపించండి

# ఉచిత బైబిల్ ట్రైనింగ్

## పురుషులకు, స్త్రీలకు అడ్మిషన్స్ 2022 ఫిబ్రవరి 1

→ 1 సం॥ లేదా 2 సం॥లు తెలుగు మీడియం బైబిల్ ట్రైనింగు **(D.B.S. or D.Th.)**
(చేతివృత్తులు ప్రత్యేకముగా నేర్పబడును)
విద్యార్హతలు : పదవ తరగతి ఫెయిల్ లేక ఆ పైన

→ 1 సం॥ లేదా 3 సం॥లు ఇంగ్లీషు మీడియం బైబిల్ ట్రైనింగు **(B.B.S. or B.D.)**
(గ్రీకు, ఇంగ్లీషు, కంప్యూటర్ నేర్పుట మా ప్రత్యేకము)
విద్యార్హతలు : ఇంటర్ ఫెయిల్ లేక ఆ పైన

**చేతివృత్తులు** : 1) టైపు 2) టైలరింగ్ 3) కంప్యూటర్ 4) టి.వి. & సెల్‌ఫోన్ మెకానిజమ్ 5) ఎలక్ట్రికల్

→ **నెలకు 5 రోజుల బైబిల్ ట్రైనింగ్ (పురుషులకు మాత్రమే)**
వయస్సుతో సంబంధం లేదు, సంఘబేధం లేదు, అన్ని మతశాఖలవారికి మా ఆహ్వానం
పెండ్లి అయినవారు, సంఘకాపరులు లేక సువార్తికులకు మాత్రమే
విద్యార్హతలు : పదవ తరగతి లేక ఆ పైన

**ఒరిజనల్ టి.సి. లేదా మార్క్‌లిస్ట్‌గాని తప్పనిసరిగా తీసుకొనిరావలెను**

**అందరికి నెలసరి స్టైఫండ్ రూ.500**

**అందరికి ఉచిత భోజనము, వసతి ఏర్పాటుచేయబడును**

స్తుతి ఫలితము

ఆసక్తి గలవారు ఈ క్రింది చిరునామాను సంప్రదించండి
డైరెక్టర్, పి.టి.స్కూలు, తూరంగి, కాకినాడ-16
ఫోన్: 0884-2342125, సెల్: 9849031095
email: **kedarisetti_2000@yahoo.com**
website: www.preacherstrainingschool.com